రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- **హాజరుకానున్న 39,980 మంది విద్యార్థులు**
- **అన్ని ఏర్పాట్లు పూర్తి.. వివరాలు వెల్లడించిన డీఐఈవో గోపాల్**

హనుమకొండ చౌరస్తా, మార్చి 3 : ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు 5 నుంచి ప్రారంభమై 24తో ముగియనున్నాయి. మార్చి 6 నుంచి మొదలయ్యే ద్వితీయ ఇంటర్ పరీక్షలు 25వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో 39,980 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఫస్ట్ ఇయర్‌లో 18,397 మంది, సెకండియర్‌లో 19,480మంది మొత్తం 37,877, వొకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 1,146, రెండో సంవత్సరం విద్యార్థులు 857 మొత్తం 2,103 మంది విద్యార్థులు ఎగ్జామ్‌కు హాజరుకానున్నారు. వీరి కోసం 55 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 55 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 55 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 42 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఏడుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. నలుగురు సిట్టింగ్ స్క్వాడ్స్‌తో పర్యవేక్షణ ఉండనుంది. 9 మంది కస్టోడియన్స్‌ని ఏర్పాటు చేశారు. ఇద్దరు సీనియర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లు, ఒక సీనియర్ లెక్చరర్‌తో డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ(డీఈసీ)ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి గోపాల్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామని, కమాండ్ కంట్రోల్ హైదరాబాద్‌లో ఉండగా, హనుమకొండ డీఐఈవో కార్యాలయం నుంచి కంట్రోల్ రూం పని చేస్తుందని ఆయన వివరించారు.

మొబైల్ వినియోగం తగ్గించాలి : డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

నయీంనగర్, మార్చి 3 : చెవులకు హాని కలుగకుండా ఉండేందుకు మొబైల్ ఫోన్లను తక్కువగా వాడాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా లష్కర్‌సింగారంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అహ్మద్, హైదర్, అశోక్‌రెడ్డి, నరేశ్, శ్రీనివాసరెడ్డి, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదాం వద్ద నిరసన తెలుపుతున్న రేషన్ డీలర్లు

రేషన్ షాపులకు పంపే బియ్యం తూకం వేయాలి

పరకాల, మార్చి 3 : గోదాంల నుంచి రేషన్ షాపులకు పంపే బియ్యాన్ని తూకం వేయాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గోదాం వద్ద రేషన్ షాపులకు పంపే బియ్యాన్ని పలువురు రేషన్ డీలర్లు తూకం వేయగా తేడా వచ్చింది. దీంతో పలువురు రేషన్ డీలర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఓ లారీలోని బియ్యాన్ని తనిఖీ చేయగా తేడా ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. తూకం వేయకుండానే బియ్యాన్ని పంపిణీ చేయడం ద్వారా రేషన్ డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విజిలెన్స్ తనిఖీల్లో అధికారులు రేషన్ డీలర్ల తప్పుగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. తూకాల్లో తేడాలపై గోదాం ఇన్‌చార్జిని సంప్రదించినా స్పందన లేదని, ఉన్నతాధికారులు డీలర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరకాల, శాయంపేట, నడికూడ, కమలాపూర్, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

పరకాల, మార్చి 3 : పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ రూరల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు వాహనం అప్‌సెట్ ధరపై 50శాతం డిపాజిట్‌గా చెల్లించాలని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ, మార్చి 3 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నక్కలగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో ఉదయం 10 నుంచి 11గంటల వరకు, నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, బాలసముద్రం ఏరియాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయత్రం 4గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీ, హంటర్ రోడ్డు ఏరియాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియా, నమస్తే తెలంగాణ వరంగల్ ఎడిషన్ ఆఫీస్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

గడువులోగా ఉపాధి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 3 : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉపాధి పనులు, పురోగతి, నిర్దేశిత లక్ష్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మండలాల్లో ఉపాధి పనుల వివరాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను వివరించగా, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని ఎస్ఈ శంకరయ్య కలెక్టర్‌కు నివేదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యం పెంచాలని, నిర్దేశిత లక్ష్యం సాధించి పథకానికి సంబంధించిన మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని, పనులు, బిల్లుల చెల్లింపుల వివరాల నివేదికను ప్రతిరోజూ సమర్పించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు డీఆర్డీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, ఎంపీడీవోల సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్న కలెక్టర్, డీఆర్డీవోను ఎంపీడీవోల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘం అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి విజయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోకి వైద్యారోగ్య శాఖ కార్యాలయం..

కలెక్టరేట్ ఆవరణలోకి జిల్లా వైద్యారోగ్య శాఖను మార్చారు. కలెక్టరేట్ రెండో అంతస్తులో వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో ఆఫీస్ కలెక్టరేట్ ప్రాంగణంలో ఉండటం వల్ల అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు. డీఎంహెచ్‌వో అప్పయ్య నాయకత్వంలో ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయకుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్ మోహన్‌రావు, పీవోడీటీ లలితాదేవి, జిల్లా టీబీ నియంత్రణాధికారి హిమబిందు, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి అహ్మద్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజేశ్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, గణాంక అధికారి ప్రసన్నకుమార్, సూపరింటెండెంట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

45 పాఠశాలల్లో 'సంస్కార వికాస శిక్షణ' పూర్తి

కలెక్టర్ సూచనలతో డీఈవో వాసంతి సహకారంతో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ గోపాలపురం, హనుమకొండ ఉభయ సంస్థల ఆధ్వర్యంలో 45 పాఠశాలల్లో 'సంస్కార వికాస శిక్షణ' కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు చెడు మార్గాల వైపు పోకుండా ఉన్నతస్థితికి ఎదగడమే కర్తవ్యంగా చదవాలని మోటివేషన్ చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్‌ను డీఈవోతో కలిసి కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. నిర్వాహకులు తేరాల యుగంధర్, మోటివేషన్ స్పీకర్ కజాంపురం, మార్క రవీందర్‌గౌడ్, తాడూరి లక్ష్మీనారాయణను కలెక్టర్ సన్మానించారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

యాసంగి సాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ పని తీరుపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీలో కలెక్టర్ ప్రావీణ్య, దేవాదుల సీఈ అశోక్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఇంటి ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడి మృతి

బక్కయ్య(ఫైల్)

భీమదేవరపల్లి, మార్చి 3 : తన వ్యవసాయ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్ రాచర్ల సారయ్య ఇంటి ఎదుట గత నెల 17న పురుగుల మందు తాగిన రాచర్ల బక్కయ్య(85) సోమవారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన బక్కయ్యకు సర్వే నంబర్ 87, 89లో 1.06 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని బక్కయ్యకు తెలియకుండా మాజీ సర్పంచ్ రాచర్ల సారయ్య తన పేరుపై పట్టా చేసుకున్నాడు. ఆరేళ్ల క్రితం ఈ విషయం తెలియగా, పలుమార్లు బక్కయ్య మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్లి పట్టా చేయమని ప్రాధేయపడినా వినలేదు. చివరకు గత నెల 17న బక్కయ్య సారయ్య ఇంటికి పురుగుల మందు డబ్బాతో వెళ్లాడు. అక్కడ ఉన్న సారయ్య భార్య పద్మ నీకు భూమి ఎక్కడిదిరా అని చీపురు, చెప్పుతో కొట్టడంతో అక్కడే బక్కయ్య పురుగుల మందు తాగాడు. వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందిన బక్కయ్య నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. మళ్లీ బక్కయ్య ఆరోగ్యం విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందాడు. అతడి కుమారుడు భద్రయ్య ఫిర్యాదు మేరకు రాచర్ల సారయ్య, అతని భార్య పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై నంద్రు సాయిబాబు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : చల్లా

నడికూడ : బాధితులను పరామర్శిస్తున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ/దామెర, మార్చి 3 : మండలంలోని వరికోల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ పర్ష కొమురయ్య కుటుంబాన్ని సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డి పరామర్శించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. దామెర మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త ముత్యాల గణేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా అతడి చిత్రపటానికి చల్లా పూలమాల వేసి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, గ్రామ అధ్యక్షుడు కునాటి సునీల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన డీఆర్డీవో

ఐనవోలు, మార్చి 3 : ఉపాధి పనులను డీఆర్డీవో మేన శ్రీను సోమవారం పరిశీలించారు. మండలంలోని పంథినిలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రంగా ఉన్నదని, కూలీలు పనికి ఉదయం 8 గంటలకే రావాలని సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఫాంపాండ్స్ పనులు పరిశీలించి కూలీలకు రోజూ రూ. 300 వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. పున్నేల్ గ్రామంలో ఫాంపాండ్స్, నర్సరీ పనులు పరిశీలించారు. 50మంది కూలీల కంటే తక్కువ మందితో పని చేయిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో నక్క కుమారస్వామి, ఈసీ ప్రదీప్, టెక్నికల్ అసిస్టెంట్ నీరజ, రమేశ్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, మాలతి, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజు, ఏలేంద్ర, జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసించాలి

హనుమకొండ, మార్చి 3 : మోదీ సర్కారు ప్రవేశపెట్టిన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ పోరాడాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సారంపల్లి వాసుదేవారెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు అధ్యక్షతన 'కేంద్ర బడ్జెట్ – ప్రజలపై భారాలు' అనే అంశంపై జరిగిన జిల్లా సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ లోటును పూడ్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థల్లోని రూ. 47 వేల కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించాలని ప్రతిపాదించారని, బీమా రంగంలో 100 శాతం వరకు విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ ఆ రంగాన్ని ప్రమాదంలో పడేసిందని విమర్శించారు. పారిశ్రామిక రంగానికి రూ. 5,300 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారని, వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు ఏం తెచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఏడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాఘవులు, పద్మ పాల్గొన్నారు.

'కేయూ దూరవిద్య'లో ప్రామాణిక పుస్తకాలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 3 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ప్రామాణిక పుస్తకాలను ప్రచురిస్తున్నదని కేంద్రం డైరెక్టర్ సురేశ్‌లాల్ అన్నారు. సోమవారం దూరవిద్యా కేంద్రంలో కొత్తగా తెచ్చిన సెమిస్టర్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ విధానాన్ని తీసుకువచ్చామన్నారు. ప్రతి విద్యార్థికి ప్రామాణిక పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అడ్మిషన్లకు మార్చి 24 వరకు అపరాధ రుసుం లేకుండా గడువు ఉందన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఆర్ట్స్ కోర్సుల కోఆర్డినేటర్ కొట్టె భాస్కర్, బుక్స్ స్టోర్స్ ఇన్‌చార్జి తాటికాయల కుమార్ ఉన్నారు.

కాజీపేట మీదుగా హోలీ స్పెషల్ రైళ్లు

కాజీపేట, మార్చి 3 : హోలీ పండుగ ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాజీపేట మీదుగా పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ స్పెషల్ రైళ్లు 07707/07708 నంబర్లతో చర్లపల్లి– హజరత్ నిజాముద్దీన్– చర్లపల్లి మధ్య ఆరు ట్రిప్పులు నడుపుతున్నామన్నారు. 07707 నంబర్‌తో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 6, 12, 16వ తేదీల్లో రాత్రి 8.45 గంటలకు బయలుదేరి అదే రాత్రి 10. 45 గంటలకు కాజీపేటకు, తిరిగి బయలుదేరి మరుపటి రోజు రాత్రి 1.30 గంటలకు హజరత్ నిజాముద్దీన్‌కు చేరుకుంటాయన్నారు. అదే విధంగా 07708 నంబర్‌తో హజరత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ నెల 8, 14, 18వ తేదీల్లో రాత్రి 3.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.30 గంటలకు కాజీపేటకు, చర్లపల్లికి 9. 30 గంటలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. ఈ స్పెషల్ రైళ్లు రాకపోకల్లో కాజీపేట, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్ కాగజ్ నగర్, బల్లార్షా, చంద్రాపూర్, నాగపూర్, రాణి, కమలపట్టి, ఝాన్సీ, ఆగ్రా, పల్వల్ స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ఈ రైలుకు 2ఏసీ, 3ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ క్లాస్ బోగీలు ఉంటాయన్నారు. రైల్వేశాఖ టికెట్ రిజర్వేషన్ ప్రారంభించిందని, ప్రయాణికులు రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మారని కేయూ మెస్ తీరు

టిఫిన్‌లో చట్నీ లేక కారంపొడితో తిన్న విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 3 : కాకతీయ యూనివర్సిటీ మెస్‌లో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. సౌకర్యాలు లేక విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారుల తీరు మారడం లేదు. మెస్‌లో విద్యార్థులకు టిఫిన్‌లో చట్నీ లేకపోవడంతో కారంపొడి వేసుకుని తినాల్సిన పరిస్థితి దాపురించింది. మెస్‌లో సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు కారంపొడి వేసుకుని తింటున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు మెస్‌పై దృష్టి సారించి నాణ్యమైన భోజనం, అన్ని సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే వీసీ చాంబర్‌లో ఆందోళనకు దిగుతామని విద్యార్థులు హెచ్చరించారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

- **ట్రిపుల్ ఆర్ రీజినల్ సదస్సులో మేయర్ సుధారాణి**
- **సిటీస్ 2.0 స్టేట్ లెవల్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్‌కు గ్రేటర్ ఎంపిక**

ఒప్పంద పత్రాలను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ చేతుల మీదుగా అందుకుంటున్న శ్రీదేవి, సుధారాణి, అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 3 : చారిత్రక వరంగల్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకు పోతున్నామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. కేంద్ర హౌసింగ్ ఎఫైర్స్ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో జరిగిన 12వ ట్రిపుల్ ఆర్ అండ్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం ఆసియా అండ్ పసిఫిక్ జాతీయ సదస్సుకు ఆమె సీడీఎంఏ శ్రీదేవి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి హాజరయ్యారు. కేంద్ర మంత్రి మనోహన్‌లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరైన సదస్సు ప్యానల్ డిస్కుర్షన్‌లో పాల్గొన్న మేయర్ నగరంలో రెడ్యూస్, రీయూజ్, రీ సైక్లింగ్ (ట్రిపుల్ ఆర్) విధానంలో అమలు చేస్తున్న పద్ధతులపై వివరించారు. త్వరలోనే వేస్ట్ టూ ఎనర్జీ యూనిట్ ఏర్పాటుకు చొరవ తీసుకుంటామని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్క్యులర్ ఎకానమీ అంశంపై కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్లాస్టిక్ నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని, ప్రత్యామ్నాయంగా జ్యూట్ సంచుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. రీ సైక్లింగ్‌లో భాగంగా నిరుపయోగంగా ఉన్న వస్తువులతో చిట్టి పార్కులు ఏర్పాటు చేశామని చెప్పారు. సిటీస్ 2.0లో భాగంగా క్లైమేట్ యాక్షన్ ప్లాన్ స్టేట్ లెవల్‌కు గ్రేటర్ ఎంపిక అయింది. సదస్సులో సీఎంహెచ్‌వో రాజారెడ్డి పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

వరంగల్, మార్చి 3 : నగరంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మసాగర్ నుంచి కేయూసీ, వడ్డేపల్లి, దేశాయిపేట ఫిల్టర్ బెడ్‌లకు నీరు చేర్చే పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిన నేపథ్యంలో వాటి పరిధిలోని ప్రాంతాల్లో మంగళవారం తాగునీటి సరఫరా జరగదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో పల్లె పలకరింపు యాత్ర

సాధన్‌పల్లిలో కాంగ్రెస్ మోసపూరిత హామీలపై ప్రజలకు వివరిస్తున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నేత శివ

శాయంపేట, మార్చి 3 : మండలంలోని సాధన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ ఆధ్వర్యంలో పల్లె పలకరింపు యాత్ర కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఇంటింటా తిరుగుతూ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 మోసపూరిత హామీలపై ఆరా తీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సమ్మయ్య, ఆవుల పాపయ్య, సాదు శ్రీను, కుమార్, కూతాటి రమేశ్, యూత్ జిల్లా నాయకులు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులకు పురస్కారం

పోలీసులకు నగదు పురస్కారం అందజేస్తున్న సీపీ

సుబేదారి, మార్చి 3 : హత్య కేసు మిస్టరీని ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసిన పరకాల ఏసీపీ సతీశ్ బాబు, శాయంపేట ఇన్‌స్పెక్టర్ రంజిత్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. సోమవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో నగదు పురస్కారాలు అందజేశారు. రెండు సంవత్సరాల క్రితం పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో జరిగిన ఓ వృద్ధురాలి హత్య మిస్టరీగా మారింది. ఇటీవల పరకాల ఏసీపీ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు చేసి ఆభరణాల కోసం వృద్ధురాలిని రాజీ రెడ్డి హత్య చేశాడని తేల్చారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమంగా చెట్లు నరికితే కఠిన చర్యలు

భీమదేవరపల్లి, మార్చి 3 : అక్రమంగా చెట్లు నరికితే కఠిన చర్యలు తప్పవని ఎల్కతుర్తి ఎఫ్ఆర్‌వో శిరీష హెచ్చరించారు. సోమవారం ముల్కనూరులో ఆమె మాట్లాడారు. ముల్కనూరు గ్రామంలో అనుమతులు లేకుండా టేకు చెట్లు నరికి వేస్తున్నారని ఒక పత్రికలో (నమస్తే తెలంగాణ కాదు) వచ్చిన వార్త అవాస్తవమన్నారు. గ్రామంలో అలిగిరెడ్డి సతీశ్‌రెడ్డి వ్యవసాయ భూమిలోని టేకు చెట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. టేకు చెట్లు నరికినట్లు ఆనవాళ్లు కూడా లేవన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో కృష్ణమాచారి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో మధుసూదన్, సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలి

బల్దియా ఎదుట ధర్నా చేస్తున్న దళిత శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు

వరంగల్, మార్చి 3 : ఉర్సు హరిజన కాలనీ వాసులకు సంబందించిన శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, స్థలాన్ని కాపాడాలని దళిత కాలనీ వాసులు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. 41వ డివిజన్‌లోని దళిత శ్మశాన వాటిక పూర్వకాలం నుంచే ఉందన్నారు. 2005లో మున్సిపల్ నిధులతో ప్రహరీ నిర్మించారని, అయితే ఇప్పుడు కొంతమంది దాన్ని కూల్చారన్నారు. సుమారు వెయ్యి గజాల స్థలం కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ప్రహరీ కూల్చివేసిన గ్లోరియస్ మినిస్ట్రీస్ క్రైస్తవ సంస్థపై చర్యలు తీసుకోవాలని, గోడను మళ్లీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో దళిత శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు మంద బాబురావు, కలకోట్ల ర